

గాయత్రీ పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీళ్లు



వెదిర నుంచి గోపాల్‌రావు పేట వరకు నిర్మించిన డబుల్ రోడ్డు ◄

నారాయణపూర్ చెరువులోకి నీటిని ఎత్తిపోస్తున్న పంపులు ▼



# నాడు కరువునేల నేడు కోనసీమ

## రూపురేఖలు మారిన చొప్పదండి నియోజకవర్గం

కరీంనగర్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ)/చొప్పదండి : తెలంగాణ రాక ముందు చొప్పదండి పరిస్థితి దారుణంగా ఉండేది. సాగునీటి వసతి లేక దశాబ్దాల పాటు కరువుతో తండ్లాడింది. ఎక్కడ చూసినా భూములు బీళ్లుగా దర్శనమిచ్చేవి. తాగునీటికీ ఇబ్బంది ఉండేది. ఎప్పుడు కరువు మండలాల జాబితాను ప్రకటించినా అందులో ఈ నియోజకవర్గంలోని మండలాల పేర్లు తప్పకుండా ఉండేవి. అభివృద్ధిలోనూ వెనుకబడి ఉండేది. రోడ్లు అధ్వానంగా కనపించేవి. అయినా, నాటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సహకారం, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కృషితో చొప్పదండి నియోజకవర్గం ప్రగతివైపు పరుగులు తీసింది. ₹1,800 కోట్లతో అభివృద్ధి జరిగింది. మరోవైపు నాడు కరువుతో తండ్లాడిన ఈ నియోజకవర్గం, నేడు కోనసీమలా మారింది.

### భూములన్నీ సస్యశ్యామలం

నాటి ఉమ్మడి రాష్ట్రంలో మెట్ట ప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గం కరువుతో అల్లాడింది. గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌ను నింపితే ఆరు మండలాలను సస్యశ్యామలం చేసే అవకాశమున్నా వివక్ష కొనసాగింది. ఫలితంగా చుక్కనీరు లేక రైతులు తమ భూములను బీళ్లుగా ఉంచాల్సి వచ్చింది. కానీ, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ చొరవతో 2017లో నారాయణపూర్ రిజర్వాయర్ అందుబాటులోకి వచ్చింది. ₹28 కోట్ల నిధులతో ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్ వరకు దెబ్బతిన్న పైప్‌లైన్‌ను పునరుద్ధరించి, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను తరలించడంతో ఎడారిని తలపించిన నారాయణపూర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో చొప్పదండి నియోజకవర్గంలోని 77 చెరువులను ప్రతి సీజన్‌లో నింపుతుండడంతో చొప్పదండి, రామడుగు, గంగాధర, కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి మండలాల పరిధిలో 67,500 ఎకరాలకు సాగునీరు అందుతున్నది. అలాగే, ₹17.37 కోట్లతో నారాయణపూర్ రిజర్వాయర్, ₹13.48 కోట్లతో పోతారం రిజర్వాయర్‌ను ప్రభుత్వం ఆధునీకరించింది. ఫలితంగా 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతున్నది. రామడుగు మండలంలోని మోతె ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా ఇదే వాగుపై ఓటీల నిర్మాణానికి ₹241 కోట్లు, వరద కాలువ ఓటీల నిర్మాణానికి ₹248 కోట్లు మంజూరు చేసింది. అలాగే, ₹37.19 కోట్లతో నియోజకవర్గంలో 18 చెక్ డ్యాంలు నిర్మించడంతో చొప్పదండి నియోజకవర్గం ఇప్పుడు పచ్చని పంటలతో మరో కోన సీమను తలపిస్తున్నది.

### 'గాయత్రీ'తో మరింత ప్రగతి

కాళేశ్వరం ప్రాజెక్టుకు చొప్పదండి నియోజకవర్గం కీలకంగా మారింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రామడుగు మండలం లక్ష్మీపూర్, వెంకట్రావుపల్లె శివారులో సుమారు ₹5 వేల కోట్లతో గాయత్రీ పంప్‌హౌస్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచే ఎగువ ఎస్సారెస్పీకి, దిగువ శ్రీరాజరాజేశ్వర జలాయానికి తరలిస్తున్నారు. ఇదే సమయంలో కాళేశ్వర జలాలతో మండలంలోని చాలా చెరువులు, కుంటలను నింపుతున్నారు. దీంతో పంప్ హౌస్ చుట్టు పక్కల అనేక గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి సాగుగోస తీరింది. పంటల సాగు విస్తీర్ణం కూడా భారీగా పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని గాయత్రీ పంప్‌హౌస్ రాష్ట్రానికే కీలకంగా మారింది. ఇక్కడ ఏర్పాటు చేసిన బాహుబలి పంపులు ప్రపంచంలోనే అతి పెద్దవిగా రికార్డు సృష్టించాయి.

### అద్దాల్లా రోడ్లు

రాష్ట్రం రాక ముందు రోడ్ల పరిస్థితి దారుణంగా ఉండేది. గుంతలు, మట్టిదారులపై దారులపై ప్రయాణం నరకం కనిపించేది. రామడుగు మండలం నుంచి కరీంనగర్ వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేది. నియోజకవర్గం మొత్తం ఇలాంటి పరిస్థితే ఉండేది. అప్పుడు రోడ్ల మరమ్మతుల చేయించాలని మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం వందలాది కోట్ల నిధులతో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచింది. గోపాల్‌రావు పేట వరకు డబుల్ రోడ్డు వేసింది. గంగాధర, మధురానగర్ మధ్య ₹4 కోట్లతో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, చొప్పదండి నుంచి రామడుగు వరకు మరో రోడ్డు ప్రగతిలో ఉంది. గుమ్లాపూర్ రోడ్డు నుంచి మల్లన్నపల్లి, కాట్నపల్లి వరకు మరో రోడ్డు పూర్తయింది. చాకుంట ఎక్స్ రోడ్ నుంచి ఇదే గ్రామం వరకు, అలాగే బూరుగుపల్లి నుంచి కొండయ్యపల్లి వరకు మరో రోడ్డు పనులు పూర్తయ్యాయి. మొత్తంగా నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ ద్వారా రోడ్ల నిర్మాణానికి ₹142 కోట్లు, వంతెన నిర్మాణానికి మరో ₹28 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ రోడ్ల కోసం ₹106.68 కోట్లు ఖర్చు చేసి, అన్ని గ్రామాలకు సౌకర్యవంతమైన రోడ్లు నిర్మించింది. అలాగే నియోజకవర్గంలోని అన్ని రహదారులకు బీటీ రెన్నోవేషన్ పనుల కోసం నిధులు మంజూరయ్యాయి. గంగాధర మండలం వెంకటయ్యపల్లి వద్ద నిర్మించిన వంతెన అనేక గ్రామాలకు వారధిగా నిలిచింది.

### భవ్యక్షేత్రంగా కొండగట్టు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న దర్శనం కోసం రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రతి రోజు వందలాది మంది భక్తులు వస్తుంటారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ ఆలయ అభివృద్ధిపై నాటి పాలకులెవరూ దృష్టి పెట్టలేదు. కానీ, నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కొండగట్టును కూడా భవ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ₹100 కోట్లు మంజూరు చేసింది. సీఎం కేసీఆర్ స్వయంగా క్షేత్రానికి వచ్చి పనులు కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి మరో ₹500 కోట్లు మంజూరు చేస్తామని హామీ కూడా ఇచ్చారు. అందుకోసం స్థానిక ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎంతో కృషి చేశారు.

### మరెన్నో అభివృద్ధి పనులు

- అభివృద్ధిలో వెనుకబడిన చొప్పదండిపై ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రత్యేక దృష్టి సారించారు. ₹67.10 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ₹33 కోట్లతో గుమ్లాపూర్ చౌరస్తా నుంచి జవహర్ నవోదయ విద్యాలయం వరకు 4 కిలోమీటర్ల సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేస్తున్నారు.
- గంగాధరలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను, మహాత్మాజ్యోతి బాపులే బీసీ గురుకుల పాఠశాలను, బూరుగుపల్లిలో మరో రెసిడెన్షియల్, చొప్పదండిలో సైనిక్ పాఠశాలను ఏర్పాటు చేశారు. 'మన ఊరు-మన బడి' కింద అనేక పాఠశాలలను అభివృద్ధి చేశారు.
- కొత్తగా కాట్నపల్లి, కోట్లనర్సింహులపల్లిలో 33/11 విద్యుత్తు ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. గంగాధర మండలం ఒద్యారంలో, కొడిమ్యాల, బోయినపల్లి మండలాల్లో మరిన్ని విద్యుత్తు ఉప కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నారు.
- చొప్పదండిలో 30 పడకల దవాఖానను ప్రారంభించారు. ₹30 లక్షల వ్యయంతో కొడిమ్యాల, మల్యాల పీహెచ్‌సీల్లో సౌకర్యాలు మెరుగు పర్చారు. 54 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేశారు. గంగాధర, చొప్పదండి పీహెచ్‌సీలను బలోపేతం చేశారు. చొప్పదండి పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మారుస్తున్నారు. అంతే కాకుండా గంగాధర పీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు.
- 2014 నుంచి 2023 వరకు సుమారు ₹1,800 కోట్లతో అభివృద్ధి
- ₹100 కోట్లతో కొండగట్టు అంజన్న క్షేత్రం అభివృద్ధి
- ₹37.19 కోట్లతో చెక్ డ్యాంల నిర్మాణాలు ➲ ₹248 కోట్లతో వరద కాలువకు ఓటీలు ➲ ₹142 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాలు ➲ ₹28 కోట్లతో ఆర్అండ్‌బీ బ్రిడ్జీల నిర్మాణాలు
- ₹106.68 కోట్లతో పీఆర్ రోడ్ల నిర్మాణాలు
- ₹5.71 కోట్లతో రైతు వేదిక నిర్మాణాలు
- ₹67.10 కోట్లతో చొప్పదండి మున్సిపాలిటీ అభివృద్ధి
- ₹241 కోట్లతో మోతె ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా మోతె వాగుపై ఓటీల నిర్మాణం – ₹10.80 కోట్లతో నూతన గ్రామపంచాయతీల నిర్మాణాలు ➲ ₹66.97 లక్షలతో పీహెచ్‌సీల అభివృద్ధి
- ₹43.15 కోట్లతో కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధి
- ₹38 కోట్లతో సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ ద్వారా లబ్ధి
- ప్రతి నెలా ₹11.79 కోట్లతో ఆసరా పెన్షన్లు



కేబుల్ బ్రిడ్జి



# అభివృద్ధే మంత్రం

## ఆదర్శంగా కరీంనగర్ నియోజకవర్గం

- సీఎం కేసీఆర్ సహకారంతో ప్రగతి బాటలు వేసిన మంత్రి గంగుల
- రాష్ట్రంలో రెండో నగరంగా కరీంనగర్ ● పదేళ్లలో ఊహించని అభివృద్ధి



ఐటీ టవర్

కరీంనగర్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ)/కార్పొరేషన్ : ఉమ్మడి రాష్ట్రంలో గతంలో గుంతలమయమైన రోడ్లు, నిండిన మురుగు కాల్వలతో అస్తవ్యస్తంగా ఉన్న కరీం'నగరం' స్వరాష్ట్రంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా రూ.వందల కోట్ల నిధులతో అభివృద్ధి సాగుతుండడం, సుందరీకరణ విషయంలో స్థానిక మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేకంగా దృష్టి సారించడంతో నగరం తన రూపు రేఖలను మార్చుకున్నది. ఇప్పటికే నగరంలోని 14.5 కిలోమీటర్ల ప్రధాన రోడ్లన్నీ 100 ఫీట్ల మేరకు విస్తరణకు నోచుకోవడమే కాకుండా, సుందరంగా మారాయి. వీటితో పాటు నగరంలోని అన్ని లింకు రోడ్లుకూడా అభివృద్ధికి నోచుకున్నాయి.

### సీఎం కేసీఆర్ తొలి పర్యటనలోనే వెల్లువలా నిధులు

స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తొలిసారిగా కరీంనగర్‌లో పర్యటించిన సందర్భంగా నగరరోడ్ల అభివృద్ధికి రూ.110 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటితోపాటు రూ.350 కోట్ల సీఎం అష్యూరెన్స్ నిధులు మంజూరయ్యాయి. నగరంలో సుమారు రూ.600 కోట్లతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. నగరంలో మంచినీటి సరఫరా, రోడ్లు, మురుగుకాల్వల అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ప్రత్యేకంగా పనులు చేపట్టారు. రూ.3.5 కోట్ల వ్యయంతో అన్ని ప్రాంతాల్లోనూ 30కి పైగా మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారు. అలాగే రూ.3 కోట్లతో 35 ప్రాంతాల్లో ఓపెన్ జిమ్స్, రూ.2.75 కోట్లతో 12 ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్స్ నిర్మించారు. అలాగే, సుమారు రూ.12 కోట్ల వ్యయంతో నగరంలోని 13 చౌరస్తాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. రూ.12 కోట్ల వ్యయంతో నగరంలోని 14 పార్కు స్థలాల్లో సుందరీకరణ పనులు పూర్తి చేశారు. వైకుంఠ ధామాలను రూ.25 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు.

### ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం..

కరీంనగర్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చేందుకు మానేరు రివర్ ఫ్రంట్ పనులు ఇప్పటికే ప్రారంభమై 30 శాతానికిపైగా పూర్తయ్యాయి. రూ.410 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రపంచ స్థాయి గుర్తింపు రానుంది. ఎల్ఎండీ డ్యాం గేట్ల నుంచి నాలుగు కిలోమీటర్ల మేరకు రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టులో బోటింగ్, అమ్యూజ్‌మెంట్ పార్కులు, వాటర్‌స్పోర్ట్స్, పౌంటేన్లు, ఆడిటోరియం, మ్యూజియం, కిడ్స్ ప్లే ఏరియాలు, సీనియర్ సిటిజన్ గార్డెన్స్, ఫ్లవర్ గార్డెన్లు, రాక్ గార్డెన్లు, లేజర్ షోలు, విశాలమైన లాండ్ స్కేపింగ్‌లు, స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్, టెన్నిస్, వాలీబాల్ కోర్టులు, వాకింగ్, జాగింగ్ ట్రాక్స్, తదితర వాటిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్నారు. ప్రపంచంలోనే మూడోది, దేశంలోనే మొదటిదైన బిగ్ ఓ వాటర్ ఫౌంటేన్‌ను మానేరు రివర్ ఫ్రంట్‌లో రూ.69 కోట్లతో ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో వాటర్ జెట్స్, ఫయిర్ జెట్స్, లేజర్ షోతో పాటు నీటిధారతో ఏర్పడే ప్రొజెక్టర్ ఉంటాయి.

### నగరానికి మణిహారంగా తీగెల వంతెన

కరీంనగర్ నుంచి సదాశివపల్లి మీదుగా వరంగల్ మెయిన్ రోడ్డును కలిసే పాత రహదారిలో మానేరుపై రూ.224 కోట్ల వ్యయంతో చేపట్టిన కేబుల్ బ్రిడ్జి నగరానికి మణిహారంగా నిలిచింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.147 కోట్లతో కేబుల్‌బ్రిడ్జి, మిగతా నిధులతో అప్రోచ్ రోడ్ల నిర్మాణం పనులు పూర్తి చేశారు. కేబుల్ బ్రిడ్జిని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.6.50 కోట్లతో డైనమిక్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. కిలోమీటర్ దూరం నుంచి కూడా స్పష్టంగా కనిపించే విధంగా జర్మన్ టెక్నాలజీతో 45 వేల పిక్సల్స్ 65 వేల కలర్స్‌తో ఉండే డైనమిక్ లైట్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే, బ్రిడ్జి పైన 10/30 సైజులో బ్రిడ్జికి రెండు వైపులా నాలుగు భారీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు.



అర్బన్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్

### హై 'టెన్షన్' పోయింది

నగరంలో హైటెన్షన్ వైర్ల సమస్య తీవ్రంగా ఉండేది. ఇళ్లపై నుంచి వెళ్లిన ఈ వైర్లను తొలగించాలంటే పెద్ద మొత్తంలో నిధులు అవసరమని అధికారులు చెప్పడంతో ఈ సమస్యను గతంలో ఎవరూ పట్టించుకో లేదు. ఈ సమస్యను చాలెంజ్‌గా తీసుకున్న మంత్రి గంగుల కమలాకర్ నేరుగా సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఒప్పించి పెద్ద మొత్తంలో నిధులు తెచ్చి అన్ని ప్రధాన రహదారులకు ఇరువైపులా 540 విద్యుత్ టవర్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు కొత్తగా ఆరింటిని ఏర్పాటు చేశా రు. దీంతో నియోజకవర్గంలో మొత్తంగా 21 సబ్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ఇటీవలే మరో రెండు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి మంత్రి గంగుల భూమిపూజ చేశారు. ఇప్పటికే కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో రెండు 132 కేవీ సబ్‌స్టేషన్లు ఉండగా పద్మనగర్‌లో మరొకటి ఏర్పాటు చేసేందుకు శరవేగంగా పనులు సాగుతున్నాయి.

### ప్రతి రోజూ తాగు నీటి సరఫరా..

రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్ చేపట్టిన అర్బన్ మిషన్ భగీరథ కింద నగరంలో రూ.116 కోట్లతో పనులు చేపట్టారు. సుమారు 45 కిలోమీటర్ల మేరకు నూతన పైపులైన్లు వేశారు. ఇప్పుడు అన్ని డివిజన్లు, కాలనీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల్లోనే మంచినీటి సరఫరా జరుగుతోంది. త్వరలో 24 గంటల పాటు మంచి నీటిని సరఫరా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### నెరవేరిన మెడికల్ కళాశాల కల

కరీంనగర్‌లో ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల చిరకాల కల నెరవేరింది. మంత్రి గంగుల చేసిన కృషి ఫలితంగా సీఎం కేసీఆర్ జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయడం, అన్ని అనుమతులతో ప్రస్తుతం తరగతులు ప్రారంభం కావడం చక చకా జరిగిపోయాయి. కొత్తపల్లి మండల కేంద్రానికి సమీపంలోని తెలంగాణ విత్తనోత్పత్తి సంస్థకు చెందిన గోదాముల్లో రూ.7 కోట్లతో తాత్కాలిక తరగతి గదులను ఏర్పాటు చేశారు. రూ.100 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం పనులు సాగుతున్నాయి. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో టీ హబ్‌ను ఏర్పాటు చేసి 57 రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో కేవలం 350 పడకలకే పరిమితమైన ఈ దవాఖానను ఇప్పుడు 600 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. అలాగే, నగరంలో కొత్తగా మూడు పీహెచ్‌సీ, రెండు బస్తీ దావాఖనలను ఏర్పాటు చేశారు.

### సంక్షేమంలోనూ అగ్రభాగం

నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ కింద ఒక్కొక్కరికి ఇప్పటి వరకు 8,572 మందికి రూ.1,00,116 చొప్పున ఆర్థిక సహాయం అందింది. రెండు విడతల్లో 868 డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరవగా, ఇప్పటికే కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో 68, ఎలగందులలో 20, ఖాజీపూర్‌లో 20, కరీంనగర్ మండలం ముగ్ధుంపూర్‌లో 40 ఇండ్ల చొప్పున మొత్తం 148 ఇండ్లను మంత్రి గంగుల కమలాకర్ లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. కరీంనగర్ అర్బన్‌కు సంబంధించిన 660 డబుల్ బెడ్రూం ఇండ్లు చింతకుంటలోని గాంధీనగర్‌లో నిర్మించారు. రెండు మండలాలకు సంబంధించి మరో 60 ఇండ్లు కూడా తుది దశలో ఉన్నాయి. ఆసరా పథకం కింద 36,994 మందికి రూ.8.10 కోట్ల పింఛన్లు ప్రతి నెలా అందుతున్నాయి. రైతు బంధు కింద నియోజకవర్గానికి ఇప్పటి వరకు రూ.123.55 కోట్ల పెట్టుబడి సహాయం అందింది. 211 మంది రైతులు వివిధ కారణాలతో మరణించగా, 203 మంది కుటుంబాలకు రైతుబీమా కింద రూ.5 లక్షల చొప్పున రూ.10.15 కోట్ల పరిహారం చెల్లించారు. సీఎంఆర్ఎఫ్ పథకం కింద 4,667 మందికి రూ.16.80 కోట్లు ఆర్థికసహాయం అందించారు. కేసీఆర్ కిట్ కింద 6,502 మందికి సహాయాన్ని అందించారు..

### అభివృద్ధి పథంలో మండలాలు

నియోజకవర్గంలోని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో అంతర్గతంగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. నియోజకవర్గంలో మొత్తంగా రూ.615.22 కోట్లతో రోడ్లు అభివృద్ధి చేశారు. ఇప్పటి వరకు రూ.508 కోట్లు వెచ్చించి 1,408 కి.మీల మేర కొత్తరోడ్ల నిర్మాణం, పునరుద్ధరణ పను లు చేపట్టారు. కరీంనగర్ నుంచి ఒద్యారం వరకు ఇటీవలే కొత్తగా రూ.88 కోట్లతో నిర్మించిన నాలుగు లైన్ల రోడ్డు వన్నె తెస్తున్నది.

### తీరిన సాగు నీటి గోస

కొత్తపల్లి మండలంలోని అనేక గ్రామాలు సాగు నీరు లేక భూములన్నీ బీళ్లుగా ఉండేవి. గంగాధర మండలం ఆచంపల్లి పరిధిలోని వరదకాలువ నుంచి రూ.30 లక్షలతో మూడు తూములు ఏర్పాటు చేసి గోదావరి జలాలను నాగుల మల్యాల ఊర చెరువులకు మళ్లించారు. అక్కడి నుంచి కమాన్‌పూర్, కొండాపూర్, ఎలగందుల చెరువులకు నీటిని తరలిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలోని బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరిగి భూములన్నీ సస్యశ్యామలంగా మారాయి.



మాలపూర్‌లో రూ.40కోట్లతో నిర్మించిన ఎంజేపీ గురుకుల పాఠశాల భవనాల సముదాయం

# హుజూరాబాద్ ప్రగతి దగదగ

## స్వరాష్ట్ర ఫలం.. అభివృద్ధి విప్లవం

- పదేండ్లలో తిరిగిన దశ
- బీఆర్ఎస్ సర్కారు కృషితో మారిన నియోజకవర్గ రూపురేఖలు
- వేలాది కోట్లతో డెవలప్‌మెంట్

కరీంనగర్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ)/హుజూరాబాద్: తెలంగాణ ఏర్పడిన పదేళ్లలో హుజూరాబాద్ నియోజకవర్గం ప్రగతిబాటలో పయనిస్తున్నది. దశాబ్ధాలుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలపక్షాన నిలిచి వారి అవసరాలను తీర్చుతోంది. మౌలిక సదుపాయాలను కల్పిస్తూ జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోంది.

### ప్రగతి దారుల్లో పట్టణాలు..

నియోజకవర్గంలోని రెండు జంట పట్టణాలుగా ఉన్న హుజూరాబాద్, జమ్మికుంట తెలంగాణ ఏర్పడిన తర్వాత ఊహించని రీతిలో అభివృద్ధిని సాధించాయి. ఉమ్మడి రాష్ట్రంలో నగర పంచాయతీలుగా ఉన్న ఈ పట్టణాలను బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసింది. హుజూరాబాద్‌లో రూ.272 కోట్ల నిధులు ఖర్చుచేసి సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించింది. మిషన్ భగీరథ, సెంట్రల్ లైటింగ్ తదితర పనులు చేశారు. రూ.3 కోట్లతో మోడ్రన్ శ్మశాన వాటిక నిర్మించింది. జమ్మికుంటలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, మిషన్ భగీరథ, సెంట్రల్ లైటింగ్, ఇతరాత్ర పనులకోసం రూ.302 కోట్ల నిధులు ఖర్చు పెట్టింది. పట్టణంలో రూ.1.5 కోట్లతో ఉద్యావవనాన్ని తలనించే శ్మశాన వాటికను నిర్మించింది.

### అద్భుతమైన రోడ్ల నిర్మాణం..

ఒకప్పుడు నరక ప్రాయంగా మారిన హుజూరాబాద్ నియోజకవర్గంలోని రోడ్లు ఇపుడు ఎక్కడ చూసినా అద్దంలా మెరిసిపోతున్నాయి. హుజూరాబాద్-జమ్మికుంట రోడ్డుకు రూ.40 కోట్లు, హుజూరాబాద్-పర్కాల రోడ్డుకు రూ.100కోట్లు కేటాయించి నాలుగు లైన్ల రహదారులుగా మార్చేశారు. వీటితో పాటు జమ్మికుంట-పచ్చునూరు, జమ్మికుంట-కమలాపూర్, జమ్మికుంట-వావిలాల సింగిల్ రోడ్లను డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.145కోట్లు వెచ్చించారు. హుజూరాబాద్ నుంచి సిర్సపల్లి మీదుగా ఆముదాలపల్లికి గతంలో రోడ్లు సరిగ్గా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. కేసీ క్యాంపు నుంచి ములుకనూరు రహదారి బీటలు వారి ఉండేది. మొలంగూర్ నుంచి వీణవంక దాకా ఉన్న సింగిల్ రోడ్డు ప్రయాణం అంటేనే ప్రజలు జంకేవాళ్లు. వీటి అభివృద్ధికి రూ.50 కోట్లు వ్యయం చేసింది. ఇతర ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్ల కోసం రూ.30 కోట్లు ఖర్చుపెట్టింది. దీంతో హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇపుడు ఏ గ్రామానికి వెళ్లినా స్థానిక రోడ్లు జాతీయ రహదారులను మరిపించేలా మారిపోయాయి. రూ.34 కోట్లతో ఆయా గ్రామాల మధ్య వంతెన నిర్మాణం పూర్తి చేశారు.

### సాగుకు పుష్కలంగా నీళ్లు

మిషన్ కాకతీయతో చెరువులు కుంటల అభివృద్ధి, పలు వాగులపై చెక్ డ్యాంల నిర్మాణం, కాకతీయ కాలువకు మరమ్మతులతో నియోజకవర్గంలో సాగుకు పుష్కలంగా నీళ్లు ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. రూ.71కోట్లతో దాదాపుగా 150 చెరువులు, కుంటలకు కట్టల మరమ్మతులు, ఫీడర్ చానళ్ల, మత్తడిల నిర్మాణం చేశారు. మానేరు వాగు, చిలుక వాగు, వీణవంక వాగు, కమలాపూర్, అంబాల వాగులపై పలు చోట్ల రూ.30 కోట్లతో చెక్‌డ్యాంలు నిర్మించడంతో సముద్రంలో కలిసే వృథా నీళ్లకు అడ్డుకట్ట వేసినట్లయ్యింది. శిథిలావస్థలో ఉన్న కాకతీయ కాలువ లైనింగ్, కాలువ కట్టలు మరమ్మతుల కోసం రూ.121 కోట్లు ప్రభుత్వం ఖర్చుపెట్టడంతో చివరి ఆయకట్టు నీరందుతున్నది.

### కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు..

తెలంగాణ వచ్చిన తర్వాత నియోజకవర్గంలో వైద్య సేవలు ఎంతో మెరుగుపడ్డాయి. హుజూరాబాద్‌లో 30 పడకల దవాఖానను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. రూ.5కోట్లతో పాత భవనాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మించారు. ఈ దవాఖానాలో ఇపుడు కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలందుతున్నాయి. రూ.6 కోట్లు వెచ్చించి జమ్మికుంట, కమలాపూర్‌లో 30 పడకల దవాఖానలకు కొత్త భవనాలు నిర్మించారు. అలాగే వీణవంక మండల కేంద్రంలో రూ.30 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. చెల్పూర్, చల్లూర్ వంటి పీహెచ్‌సీల్లో సౌకర్యాలు మెరుగుపర్చారు. హుజూరాబాద్ ,జమ్మికుంట, కమలాపూర్ దవాఖానాల్లో కలిపి రోజుకు 15 ప్రసవాలు జరుగుతున్నాయి.

### మెరుగైన విద్య కోసం..

తెలంగాణ ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలు పెరిగాయి. విద్యావకాశాలు మెరుగయ్యాయి. కమలాపూర్‌లో రూ.40 కోట్లతో ఎంజేపీ బాలుర, బాలికల, రూ.8 కోట్లతో ప్రభుత్వ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనాలు, హుజూరాబాద్ పట్టణంలో రూ.2 కోట్లతో డిగ్రీ కళాశాల, ఇల్లందకుంటలో రూ.3.35 కోట్లతో కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, జమ్మికుంట పట్టణంలో రూ.3 కోట్లతో డిగ్రీ కళాశాల, రూ.1.50 కోట్లతో ప్రభుత్వ పాఠశాల నిర్మించారు. ఇల్లందకుంటలో రూ.9.35 లక్షలతో 18, వీణవంకలో రూ.2.75 కోట్లతో 18, హుజూరాబాద్ రూ.80 లక్షలతో 8, జమ్మికుంటలో రూ. 90 లక్షలతో 12, కమలాపూర్ రూ.1.20 కోట్లతో 14 ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు మన బడి కింద పునరుద్ధరించారు.

### ప్రగతి బాటలో పల్లెలు..

రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలతోపాటు గ్రామాలను అభివృద్ధి చేస్తోంది. పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా స్ఫూర్తిదాయకమైన అభివృద్ధిని సాధించింది. ప్రతి పల్లెలో వైకుంఠధామాల నిర్మాణం చేపట్టింది. దీని కోసం రూ. 12కోట్లు ప్రభుత్వం కేటాయించగా 99 శాతం శ్మశాన వాటికల నిర్మాణం పూర్తయ్యింది. రూ.5 కోట్లతో సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డులు నిర్మించారు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రతి పల్లెలో పచ్చదనం వెల్లివిరిసేందుకు పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. పారిశుధ్య లోపం లేకుండా ప్రతి రోజూ గ్రామాలను పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి గ్రామంలో చెత్తను తరలించేందుకు ట్రాక్టర్‌ను ప్రభుత్వం సమకూర్చింది. రూ.12.60 కోట్లతో కొత్త పంచాయతీ భవనాలను నిర్మించింది. రైతుల కోసం రూ.5.06 కోట్లతో రైతు వేదికలను నిర్మించింది.



హుజూరాబాద్ సమీపంలో చిలుకవాగుపై రూ.3.2 కోట్లతో నిర్మించిన బ్రిడ్జి

### పాడి కౌశిక్ రెడ్డి ప్రత్యేక కృషి..

హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కౌశిక్ రెడ్డి చేసిన ప్రత్యేక కృషితో నియోజకవర్గంలోని కుల సంఘాలు, మహిళా సంఘాల భవనాలకు రూ.32 కోట్లు మంజూరయ్యాయి. హుజూరాబాద్ స్టేడియం అభివృద్ధి కోసం రూ.10 కోట్లు మంజూరు చేయించారు. రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు కౌశిక్ రెడ్డి పెద్ద మొత్తంలో నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందనే దీమా ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నది.

### సంక్షేమ పథకాల అమలులో..

అభివృద్ధి పనులే కాకుండా నియోజకవర్గంలో సంక్షేమ పథకాలకు కూడా పెద్దపీట వేస్తున్నారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తున్నది. కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు జరిగిన లబ్ధి రూ.63.10 కోట్లు అందించారు. సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ ద్వారా రూ.52 కోట్లు అందించారు. ఆసరా పథకం కింద 39,295 మందికి ప్రతి నెలా రూ.8.65 కోట్లు అందిస్తోంది. రైతు బంధు కింద 61,538 మంది రైతులకు ప్రతి సీజన్‌కు రూ.57.65 కోట్ల పెట్టుబడి సాయం అందిస్తున్నది. అలాగే 81 బాధిత రైతు కుటుంబాలకు రూ.4.5 కోట్ల రైతుబీమా అందించింది.